సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 18 । మే । 2023

అక్కడ అలా.. ఇక్కడ ఇలా!
టీడీపీలో వర్గపోరుకు ఆజ్యం పోస్తున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. పెనుకొండలో ఇప్పటికే చాలా మంది అగ్ర నాయకులు పార్టీకి దూరమయ్యారు.

8లో



టన్ను చీనీ రూ.40 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.40 వేలు, కనిష్టం రూ.12 వేలు, సరాసరిన రూ.23,500 ధర పలికాయి.



జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

అర్హులందరికీ రైత్వారీ పట్టాలు



సాగు రైతులతో మాట్లాడుతున్న జేసీ టీ.ఎస్.చేతన్

ఓడీ చెరువు: మండలంలోని తంగేడుకుంట గ్రామ శోత్రియం భూముల సాగుదారులతో బుధవారం జాయింట్ కలెక్టర్ టీ.ఎస్. చేతన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో శోత్రియం దారులు, సాగురైతులతో జేసీ సమావేశమయ్యారు. రైత్వారీ పట్టా పొందేందుకు గల ఇబ్బందులను రైతులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత ధ్రువీకరణ, హక్కుపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి రైత్వారీ పట్టాలు అందజేస్తామన్నారు. ఇటీవల 150 ఎకరాలకు సంబంధించి 55 మందికి రైత్వారీ పట్టాలు ఇచ్చామన్నారు. అర్హులైన రైతులు ఇంకా మిగిలి ఉంటే వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం తంగేడుకుంట, లింగాలవారిపల్లి గ్రామాలకు సంబంధించి 160 మంది రైతులు తహసీల్దార్‌కు క్లైములు ఇచ్చుకున్నట్లు రైతులు చెప్పారు. వాటిలో 40 మంది రైతుల క్లైములను సిద్ధం చేసినట్లు తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి సాగు రైతులకు పట్టాలు ఇచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ పోలప్ప, ఆర్‌ఐ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా

- ఈ నెల 22 నుంచి 31 వరకు అవకాశం

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేస్తూ మార్గదర్శకాలతో కూడిన జీఓ 71ను బుధవారం జారీ చేసింది. ఈ నెల 22 నుంచి 31లోపు మార్గదర్శకాలను అనుసరించి ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌ల ప్రక్రియను ముగించాల్సి ఉంటుంది. విద్యాశాఖ మినహా ఇతర అన్ని శాఖలూ బదిలీలు చేపట్టవచ్చు. బదిలీలు పూర్తిగా ఉద్యోగుల అభ్యర్థన మేరకు ఉంటాయి.

మార్గదర్శకాలిలా...
ఒకే స్థానంలో రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారు బదిలీలకు అర్హులు. ఒకే స్థానంలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీపై వెళ్లాల్సి ఉంటుంది. బదిలీల్లో ప్రాధాన్యత ఎవరికి ఇవ్వాలనేదానిపైనా స్పష్టత ఇచ్చారు. 40 శాతం అంతకు మించి వైకల్యం ఉన్న దివ్యాంగులు, బుద్ధిమాంద్య సంతానం ఉన్నవారు, ఉద్యోగిపై ఆధారపడిన వారు ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతున్న (కేన్సర్, గుండె చికిత్స, న్యూరో సర్జరీ, కిడ్నీల మార్పు) వారు ఉంటే, కారుణ్య నియామకం పొందిన వితంతువులకు, స్పౌజ్ కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం అండ

- ట్రై స్కూటర్ల పంపిణీకి సర్వం సిద్ధం



పంపిణీకి సిద్ధమైన వాహనాలు

పుట్టపర్తి అర్బన్: దివ్యాంగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే అనేక పథకాల వారికి లబ్ధిచేకూరుస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు మోటరైజ్డ్ త్రీవీలర్ వాహనాలను పంపిణీకి సిద్ధమైంది. గత నెలలో పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన కాన్ఫరెన్స్ హాల్‌లో త్రీవీలర్ వాహనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి వివిధ శాఖల అధికారులు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఇంటర్వ్యూ నిర్వహించారు. విద్యావంతులైన దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను గమనించి అర్హులైన వారికి వాహన సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో మోటార్ అమర్చిన త్రీ వీలర్ వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజక వర్గాల్లోని దివ్యాంగులకు 60 వాహనాలను సరఫరా చేసింది. ఇందులో 50 శాతం మహిళలు, 50 శాతం పురుషులకు, ఎస్సీ, ఎస్టీ, జనరల్ తదితర రిజర్వేషన్ల వారీగా త్రీవీలర్ వాహనాలను అందజేయనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని ఆరు నియోజక వర్గాలకు 60 వాహనాలను మంజూరు చేయగా వాటిని జిల్లా కేంద్రంలోని వ్యవసాయశాఖ గోడౌన్‌లో భద్ర పరిచారు. ఒక్కో వాహనం రూ.లక్షకు పైగా ఖరీదు చేస్తుందని అధికారులు చెబుతున్నారు. ట్రై స్కూటర్ల పంపిణీ కార్యక్రమాన్ని దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి రసూల్ పర్యవేక్షిస్తున్నారు.

సీట్లు లేవు..



- ఇంటర్ అడ్మిషన్లకు భారీగా వసూళ్లు
- రెసిడెన్షియల్ కాలేజీల్లో అయితే ఏడాదికి రూ.లక్షల్లో
- రకరకాల బ్యాచ్‌ల పేరుతో పిండుకుంటున్న కళాశాలలు
- పిల్లలను ఎక్కడ చేర్పించాలో తెలియక తల్లిదండ్రుల తికమక
- ఐఐటీ, నిట్‌లలో సీట్లు వస్తాయని విజయవాడకు పరుగో పరుగు
- ఏడాదికి రూ.రెండున్నర లక్షలకు పైగా వసూలు చేస్తున్న కార్పొరేట్ కాలేజీలు
- పదో తరగతిలో మంచి మార్కులు సాధించినా డబ్బులో పైసా తగ్గేది లేదు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: విద్యార్థుల తల్లిదండ్రులకు అతిపెద్ద సమస్య వచ్చిపడింది. తమ పిల్లలు పదవ తరగతిలో మంచి మార్కులు సాధించినందుకు సంతోషపడాలో.. ఇంటర్మీడియెట్ అడ్మిషన్ రూ.లక్షల్లో పలుకుతున్నందుకు బాధపడాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. ఏ కాలేజీలో చేర్పించాలో కూడా తేల్చుకోలేక సతమతమవుతున్న పరిస్థితి. కార్పొరేట్ కాలేజీలు విసిరే ఉచ్చు ఏదో ఒక రకంగా విద్యార్థుల తల్లిదండ్రులకు తగులుతూనే ఉంది. తమ వద్ద చదివితే నిట్, ఐఐటీ, ట్రిపుల్‌ఐటీ వంటి వాటిల్లో సీట్లు వస్తాయని ఆశ చూపి అడ్మిషన్‌కు రూ.లక్షల్లో వసూలు చేస్తున్న తీరు మధ్యతరగతి కుటుంబాల్లో గుబులు రేపుతోంది.

అడుగు పెట్టగానే 'సీట్లు లేవు'..
కార్పొరేట్ కాలేజీల వ్యూహంలో మొదటి భాగం 'సీట్లు లేవు' అనే పదం. అప్పటికి 10 శాతం సీట్లు కూడా భర్తీ అయ్యుండవు. అయినా 'సీట్లు లేవండీ, వారం రోజుల కిందటే అడ్మిషన్లు పూర్తయ్యాయి' అంటారు. దీంతో తల్లిదండ్రులు సీటుకోసం బతిమలాడటం మొదలుపెడతారు. ఈ బలహీనతను క్యాష్ చేసుకుని ఎలాగోలా సీటిస్తాం..అంటూ భారీగా రేటు చెబుతారు. దీంతో సీటొస్తే చాలు రేటు ఎంతయినాగానీ కట్టేందుకు సిద్ధపడుతున్నారు.

ఏడాదికి రూ.రెండున్నర లక్షలా?
విజయవాడ కేంద్రంగా జరిగే ఇంటర్మీడియట్ కార్పొరేట్ వ్యాపారం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు పాకింది. పలు ఇంటర్ రెసిడెన్షియల్ కాలేజీలు తమ ఏజెంట్ల ద్వారా ఇక్కడ తల్లిదండ్రులకు ఫోన్ చేసి ముగ్గులో దించుతున్నారు. కాలేజీలో రకరకాల గ్రూపుల పేరుతో గరిష్టంగా ఏడాదికి రూ.2.50 లక్షలు వసూలు చేస్తున్నారు. ఈ రేటు వినగానే తల్లిదండ్రులకు మూర్ఛ వచ్చినంత పనవుతోంది. రెండేళ్ల ఇంటర్మీడియట్ కోర్సుకే ఖర్చులతో కలిపి రూ.6 లక్షలు వ్యయం చేయాల్సి వస్తోంది. జాతీయ విద్యా సంస్థల్లో సీట్లు తెప్పిస్తామన్న కాలేజీల ప్రకటనలు నమ్మి తల్లిదండ్రులు విజయవాడకు పరుగులు తీస్తున్నారు.

2023లో ఎస్‌ఎస్‌సీలో పాసైన విద్యార్థుల వివరాలు	
అనంతపురం జిల్లాలో..	
హాజరైన బాలురు	15,307
ఉత్తీర్ణులైన బాలురు	9,594
హాజరైన బాలికలు	14,359
ఉత్తీర్ణులైన బాలికలు	10,060
మొత్తం హాజరైన వారు	29,666
మొత్తం ఉత్తీర్ణులైన వారు	19,654
శ్రీసత్యసాయి జిల్లాలో..	
హాజరైన బాలురు	11,566
ఉత్తీర్ణులైన బాలురు	6,740
హాజరైన బాలికలు	10,677
ఉత్తీర్ణులైన బాలికలు	7,009
మొత్తం హాజరైన వారు	22,243
మొత్తం ఉత్తీర్ణులైన వారు	13,749

బలహీనతను సొమ్ము చేసుకోవడమే..



మనపిల్లవాడు బాగా చదివే వాడైతే.. కార్పొరేట్ కాలేజీ సొమ్ము చేసుకుంటోంది తప్ప.. కాలేజీ బాగా చదువు చెప్పి మన పిల్లాడికి ఉపయోగపడడం లేదు. ఇది తల్లిదండ్రులు గ్రహించాలి. మనం అక్కడ చేర్పించాక బాగా చదివే పదిమందో, వందమందిపైన మాత్రమే కాలేజీ ఏకాగ్రత చూపిస్తుంది. మనం లక్షలు వెచ్చించినా మనపైన ఏకాగ్రత ఉండదు. కాబట్టి మనపిల్లాడు చదివేవాడైతే కార్పొరేట్ కాలేజీ అయినా ప్రభుత్వ కాలేజీ అయినా ఒకటే. పిల్లల పట్ల తల్లిదండ్రులకు ఉన్న బలహీనతను వాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. **–డా.ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్యనిపుణులు**

ఇష్టానుసారంగా వసూలు చేస్తే చర్యలు



ఇంటర్ ప్రవేశాలకు కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూళ్లు చేస్తే చర్యలు తప్పవు. రకరకాల కోర్సుల పేరుతో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకోవాలి. అంతేకానీ ఇబ్బడిముబ్బడిగా ఫీజులు వసూళ్లు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదు. **– సురేష్‌బాబు, ఆర్‌ఐఓ**

మిత్రున్ని ఫ్లైట్ ఎక్కించడానికి వెళుతూ..

- కారు, మినీ ఐషర్ ఢీ, ఒకరి మృతి



మృతుడు నిజాముద్దీన్

బి.కొత్తకోట: ఉపాధి కోసం కువైట్‌కు వెళ్తున్న మిత్రున్ని చెన్నై విమానాశ్రయం వద్ద వదిలేందుకు కారులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మినీఐషర్ వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ ఎర్రమద్దువారిపల్లె సమీపంలో జరిగింది. ఎస్‌ఐ కే.రామమోహన్ వివరాలమేరకు... శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన ఇనాయతుల్లా ఉపాధి కోసం కువైట్‌కు వెళ్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున చెన్నై విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సి ఉంది. ఇనాయతుల్లాకు తోడుగా కదిరి పట్టణానికి చెందిన మిత్రులు నిజాముద్దీన్ (50), ఇమ్రాన్‌ఖాన్ , మహబూబ్‌బాషా , అబిద్, కారు డ్రైవర్ ఫిర్దోస్ అర్ధరాత్రి కారులో చెన్నైకి బయలుదేరారు. అయితే ఎర్రమద్దువారిపల్లె సమీపంలో గుంటూరు జిల్లా చిట్టాడ నుంచి పచ్చిమిర్చి లోడ్‌తో కదిరి వైపు వస్తున్న మినీ ఐషర్ వేగంగా కారును ఢీ కొంది. కారులో ప్రయాణిస్తున్న నిజాముద్దీన్ దుర్మరణం చెందాడు. డ్రైవర్ ఫిర్దోస్, మహబూబ్‌బాషా, ఇనాయతుల్లా, ఇమ్రాన్‌ఖాన్, అబిద్‌లకు గాయాలయ్యాయి. మినీఐషర్ వాహనం డ్రైవర్ అభిలాష్ కూడా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వారిని తిరుపతి తరలించారు. మిత్రున్ని కువైట్‌కు పంపేందుకు బయలుదేరి మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇనాయతుల్లా కువైట్ ప్రయాణం ఆగిపోవడంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై ఆగ్రహం



జెడ్పీటీసీ సభ్యురాలు అనూష, నాగరాజుకు సర్దిచెబుతున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

- అక్రమార్కులను ప్రోత్సహిస్తున్న అధికారులు
- జెడ్పీ స్థాయీ సంఘం సమావేశాల్లో సభ్యుల ధ్వజం

అనంతపురం సిటీ: హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారి వెంబడి దాబాలు, అపార్ట్‌మెంట్లు అక్రమంగా వెలుస్తున్నాయని జిల్లాపరిషత్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు భారీ మొత్తంలో మామూళ్లు తీసుకుని అక్రమార్కులను ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ప్రభాకర్ రావును జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో పాటు సభ్యులు మంజునాథ(శెట్టూరు), భాస్కర్(బుక్కరాయసముద్రం) డిమాండ్ చేశారు. జిల్లాపరిషత్ స్థాయీ సంఘం–2, 4 (గ్రామీణాభివృద్ధి/ విద్య/ వైద్య శాఖలు) సమావేశాలు చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. సీఈఓ భాస్కర్‌రెడ్డి చర్చను ప్రారంభించారు. చిన్న చిన్న నిర్మాణాలు మొదలుపెట్టే పేదలు, వృద్ధులు, అనాథ పిల్లలకు నిస్వార్థంగా సేవలందించే ఆశ్రయాలు, పాఠశాలలపై అధికారులు పగబట్టినట్లు వేధించడం సరికాదని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి వెంబడి రూ.కోట్లు విలువ చేసే భారీ భవంతులు, రెస్టారెంట్లు, దాబాలు అక్రమంగా నిర్మించే వారి భరతం పట్టాలన్నారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగం మరచి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మునిగితేలుతున్నారని, అటువంటి వారిని సస్పెండ్ చేయాల్సిందేనని సభ్యులు పట్టుబట్టారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదన్నారు.

బోధన ప్రమాణాలు మెరుగుపరచండి
విద్యా శాఖపై చర్చ ప్రారంభించిన వెంటనే అనంతపురం డీఈఓ సాయిరాం మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం జరిగిన పదో తరగతిలో మంచి ప్రగతి సాధించామని చెప్పుకురాగా.. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అభ్యంతరం తెలిపారు. ఆశించిన స్థాయిలో పదో తరగతి ఫలితాలు రాలేదన్నారు. బోధనా ప్రమాణాలు మెరుగుపరచి ఉత్తీర్ణత శాతం పెరిగేలా చూడాలని ఆదేశించారు. తమ ప్రాంతాల్లోని హైస్కూళ్లకు అదనపు తరగతి గదులు కేటాయించాలని చిలమత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు అనూష, కంబదూరు జెడ్పీటీసీ నాగరాజు, చెన్నేకొత్తపల్లి జెడ్పీటీసీ గోవిందరెడ్డి డీఈఓను కోరారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలకు కనీస వసతులు కల్పించాలని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డికి జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. వైద్య శాఖపైనా చర్చ సాగింది. సీఈఓ భాస్కర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

- జెడ్పీలోని అదనపు సమావేశ భవన్‌లో స్థాయీ సంఘం–5, 6 (స్త్రీ, శిశు సంక్షేమం/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ ఆధ్వర్యంలో కొనసాగాయి. ఐసీడీఎస్ సమావేశానికి అధ్యక్షురాలు హసీనాబాను రాకపోవడంతో ఆమె స్థానంలో బెళుగుప్ప జెడ్పీటీసీ సభ్యురాలు మమత అధ్యక్షత వహించారు. ఐసీడీఎస్ శ్రీసత్యసాయి జిల్లా పీడీ లక్ష్మీకుమారి, అనంతపురం పీడీ కార్యాలయం నుంచి నోడల్ ఆఫీసర్ వనజాక్షి, ఈఓ భారతి, సఖి సెంటర్ మేనేజర్ శాంతామణి హాజరయ్యారు. అంగన్‌వాడీల నియామకాలు, కేంద్రాల నిర్వహణ, పౌష్టికాహారం పంపిణీకి సంబంధించిన అనేక అంశాలపై అధ్యక్షురాలు మమత సహా సభ్యులు చంద్ర(అనంతపురం రూరల్), కోటి సుధ(బత్తలపల్లి) ప్రశ్నించారు.
- సాంఘిక సంక్షేమ శాఖల సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ అధ్యక్షత వహించారు. సాంఘిక సంక్షేమ శాఖల్లో జరిగే ప్రతి అంశం తనకు తెలియాల్సిందేనని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఖుష్బూ కొఠారి, మస్తాన్, అన్నాదొరతోపాటు తదితరులు హాజరయ్యారు.

'మల్బరీ'లో మంచి ఫలితాలు సాధించాలి



నల్లమాడ వద్ద పట్టు పరుగుల పెంపకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- కలెక్టర్ అరుణ్‌బాబు

కదిరి అర్బన్/నల్లమాడ: మల్బరీ సాగులో రైతులు మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం కదిరి మున్సిపాల్టీలోని ముర్తిపల్లిలో చౌదరీ అనే రైతు మల్బరీ తోటతో పాటు నల్లమాడ సమీపంలో రైతు జయరామిరెడ్డి నిర్వహిస్తున్న శ్రీజయ చాకీ సెంటర్ (పట్టు పురుగుల పెంపకం) కేంద్రం, మల్బరీ తోటను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ముర్తిపల్లిలో వెంటిలేషన్ సిల్క్‌వార్మ్ షెడ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టుపురుగుల పెంపకంషెడ్‌లో ఉష్ణోగ్రత, తేమను నిర్వహించడానికి అన్ని సౌకర్యాలు కల్పించామని పట్టుశాఖ జేడీ పద్మమ్మ పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి మల్బరీ సాగులో రైతులు మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ అరుణ్‌బాబు రైతులకు సూచించారు. రైతులు ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. నల్లమాడ వద్ద రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ చాకీ సెంటర్ నుంచి ఆరోగ్యకరమైన, ధృఢమైన పట్టు పరుగులను చుట్టు పక్కల రైతులకు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తద్వారా పట్టుపురుగుల పెంపకంలో రైతులు నాణ్యమైన అధిక దిగుబడిని పొందడం సాధ్యమవుతుందన్నారు. పట్టు రైతులకు అధికారులు మరింత ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓలు రాఘవేంద్ర, భాగ్యరేఖ, సెరికల్చర్ ఏడీ గీతతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిప్పుల కుంపటి



భానుడు భగభగా మండుతున్నాడు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. పగలు 42 డిగ్రీలు దాటుతున్నాయి. బుధవారం జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 43.5 డిగ్రీలు నమోదైంది. ఉదయం పది గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తీవ్రమైన వడగాడ్పులు వీస్తుండటంతో జనం అల్లాడిపోతున్నారు. తప్పనిసరై బయటకు రావాల్సి వస్తే గొడుగు పట్టుకునో.. తలకు టోపీ పెట్టుకునే, కర్చీఫ్ కట్టుకునో కనిపిస్తున్నారు. రోడ్డుపై వెళ్తుంటే వేడి సెగలు కక్కుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

– అనంతపురం అగ్రికల్చర్

'నకిలీ'కి చెక్!

- రూ.21 లక్షల నకిలీ కరెన్సీ, గోల్డ్ బిస్కెట్ల పట్టివేత
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న ఎస్పీ మాధవరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ, బంగారం

కొత్తచెరువు: నకిలీ కరెన్సీతో పాటు నకిలీ బంగారాన్ని ఆశ చూపుతూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.21 లక్షల నకిలీ కరెన్సీ, నకిలీ బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన బుక్కె గోవిందనాయక్ కొంత కాలంగా నకిలీ కరెన్సీతో పాటు నకిలీ బంగారాన్ని చెలామణి చేస్తూ ప్రజలను మోసగిస్తున్నాడన్నారు. ధర్మవరం పట్టణ సీఐ టి.సుబ్రమణ్యం, ముదిగుబ్బ ఎస్‌ఐ హేమంత్‌కుమార్‌లకు సమాచారం రావడంతో ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కదిరి వైపు వెళ్లే రహదారిలో రైల్వే గేట్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా బుక్కె గోవిందనాయక్ కదిరి వైపు నుంచి హుందాయ్ వెన్యూ కారులో నకిలీ కరెన్సీ, బంగారం పెట్టుకొని వస్తున్నాడని చెప్పారు. అయితే పోలీసులను గమనించిన నిందితుడు కారును వెనక్కితిప్పి పారిపోయేందుకు ప్రయత్నించాడన్నారు. సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ హేమంత్‌కుమార్ సిబ్బందితో కలసి వెంటపడి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. బుక్కె గోవింద నాయక్ నుంచి రూ.21 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు, రూ.2 వేలు విలువ చేసే 500 నోట్లు నాలుగు, 50 గ్రాముల ఒరిజినల్ బంగారు బిస్కెట్, 102 గ్రాముల నకిలీ బంగారు బిస్కెట్లు, 185 గ్రాముల నకిలీ బంగారు చైనుతో పాటు కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వివరించారు.

నిందితుడిపై గతంలోనూ కేసులు
బుక్కె గోవిందనాయక్‌పై గతంలోనే పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలియజేశారు. కదిరి రూరల్, ప్రొద్దుటూరు 1 టౌన్, తనకల్లు పోలీస్‌స్టేషన్‌లలో మూడు కేసులు ఉన్నాయన్నారు. కొందరు మోసగాళ్లు ప్రజలకు ఆశ చూపుతూ నకిలీ కరెన్సీ, బంగారాన్ని చెలామణి చేస్తున్నారని, అయితే ప్రజలు కూడా ఇటువంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరెన్సీ మార్చేవారితో పాటు తీసుకున్న వారిని కూడా నేరస్తులుగా పరిగణిస్తామన్నారు. అపరిచిత వ్యక్తులు ఇలాంటి వ్యాపారం చేస్తున్న విషయం తెలిస్తే వెంటనే సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ధర్మవరం సబ్ డివిజన్ పోలీస్ సిబ్బందికి రివార్డులకు సిఫార్సు చేయనున్నట్లు ఎస్పీ తెలియజేశారు. సమావేశంలో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు సుబ్రమణ్యం, కంబగిరి రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీమ అభివృద్ధి సాధనకు కదిలిరండి



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

చిలమత్తూరు: రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కదిలిరావాలని జిల్లా వాసులకు రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. చిలమత్తూరు మండల పరిధిలోని ఇండజ్ జీన్ ఎక్స్‌ప్రెషన్స్ లిమిటెడ్ వ్యాక్సిన్ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధిని ఆకాంక్షిస్తూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళ్లేలా ఐదు లక్షల మందితో సంతకాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో వీటిని ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి రాయలసీమ ప్రాంతానికి నీటి వనరులు, పరిశ్రమలను రాబట్టుకునేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇండజ్ జీన్ అధినేత డాక్టర్ చెన్నారెడ్డి, శాస్త్రవేత్తలు హర్షవర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్, నిషిత, సంధ్యావాణి, సయ్యద్ హుస్సేన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

డి.హీరేహాళ్(రాయదుర్గం): డి.హీరేహాళ్ మండలంలోని కల్యం వద్ద మంగళవారం అర్ధరాత్రి వాహనం ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ మేరకు డి.హీరేహాళ్ ఎస్‌ఐ రంగడుయాదవ్ బుధవారం తెలిపారు. సుమారు 32 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి, మతిస్థిమితం లేకుండా చుట్టుపక్కల గ్రామాల్లో సంచరించేవాడని గుర్తించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మున్సిపల్ కార్మికుల సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా!



బీకే పార్థసారథితో గొడవ పడుతున్న సవిత వర్గీయులు (ఫైల్)

టీడీపీలో విభేదాలు తారస్థాయికి

- పరిగిలో బీకేపై సవిత అనుచరుల తిరుగుబాటు?
- ఓవరాక్షన్ చేస్తే దెబ్బలు తింటారని హెచ్చరికలు

మౌనం వహించి తల దించుకున్న పార్థుడు

పెనుకొండ: జిల్లా టీడీపీలో వర్గపోరుకు ఆజ్యం పోస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. బీకే అల్లుడు, కర్ణాటకకు చెందిన శశిభూషణ్ పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ పెనుకొండ నియోజకవర్గంలో ఇప్పటికే చాలా మంది అగ్ర నాయకులు పార్టీకి దూరమయ్యారు. తాజాగా ఈ పరిస్థితి మరింత దిగజారింది. ఓ పార్టీకి జిల్లా అధ్యక్షుడు అనే కనీస గౌరవం కూడా ఇవ్వకుండా వర్గపోరుకు ఆజ్యం పోస్తూ కింది స్థాయి కార్యకర్తలు ప్రత్యక్షంగా ఆయనపై నోరు పారేసుకునే దుస్థితి నెలకొంది. మరో వైపు ఎస్సీ రిజర్వేషన్‌గా ఉన్న మడకశిర నియోజకవర్గంలో అగ్రవర్ణాల అధిపత్యాన్ని నిరసిస్తూ పార్టీ కార్యకలాపాలకు దళితులు దూరమయ్యారు. ఇందుకు బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ శతజయంతి వేడుక వేదికగా మారింది.

రెండ్రోజుల క్రితం పరిగిలో..

నారా లోకేష్ పాదయాత్ర వంద రోజులకు చేరుకున్న నేపథ్యంలో పెనుకొండ నియోజకవర్గంలో సంఘీభావ పాదయాత్రలను బీకే పార్థసారథి చేపట్టారు. ఈ క్రమంలో రెండ్రోజుల క్రితం పరిగి మండలం బీరలింగేశ్వరాలయం నుంచి పైడేటి వరకూ సాగిన పాదయాత్రకు సవితమ్మ వర్గీయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ విషయం గిట్టని బీకే... తన పక్కనే నడుస్తున్న సవితమ్మపై అసహనానికి గురయ్యారు. విషయాన్ని గుర్తించిన సవితమ్మ ప్రధాన అనుచరుడు వెంటనే బీకేపై రెచ్చిపోయాడు. ప్రధాన నాయకుడిని ఉద్దేశించి ఓవరాక్షన్ చేస్తే దెబ్బలు తింటారని హెచ్చరించాడు. నీ చేత ఏమీ కాదంటూ సవాల్ విసిరాడు. భారీ ఎత్తున పాల్గొన్న నాయకులు, కార్యకర్తల మధ్య అలా మాట్లాడడంతో బీకే మౌనం వహించి, తలదించుకున్నట్లు తెలిసింది. ఈ అంశాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

సోషల్ మీడియా వేదికగా వర్గపోరు

బీకే, సవితమ్మ మధ్య వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. సామాజిక మాధ్యమాలు వేదికగా రోజూ ఒకరిపై ఒకరు పోస్టింగ్‌లు చేస్తుండడం చర్చనీయాంశమయ్యాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రెండు వర్గాలు ప్రత్యక్ష దాడులకు తెగబడడం ఖాయమని ఆ పార్టీకి చెందిన ఓ ప్రధాన నాయకుడు బహిరంగంగానే పేర్కొంటున్నారు.

- అందరి అంచనాలు నిజమయ్యాయి
- ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలకు ఈరన్న వర్గం దూరం
- కరపత్రంలో కనిపించని దళిత నాయకుల పేర్లు

మడకశిర: నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మడకశిర వేదికగా బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా స్థాయి నాయకులందరూ పాల్గొన్న ఈ వేడుకలకు అందరూ ఊహించినట్లుగానే మాజీ ఎమ్మెల్యే ఈరన్న, ఆయన వర్గీయులు దూరంగా ఉన్నారు.

దళితులను కాదని..

మడకశిర నియోజకవర్గంలో ఈరన్నకు మంచి పట్టు ఉంది. గత ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా టీడీపీ అధిష్టానం ఆయనను నియమించింది. ఆ సమయంలో పార్టీ పటిష్టతకు ఆయన శ్రమించారు. అనంతరం చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈరన్నను తొలగిస్తూ పార్టీ ఇన్‌చార్జ్‌గా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి అప్పగించారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో ఈరన్నకు ప్రాధాన్యత లేకుండా పోయింది. ప్రతి అంశంలోనూ ఈరన్న ఎదుగుదలను పూర్తి స్థాయిలో అణచివేశారు.

ఆత్మాభిమానాన్ని చంపుకోలేక

ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలకు సంబంధించి ముద్రించిన కరపత్రాల్లో దళిత నాయకుల పేర్లు లేకపోవడంపై ఈరన్న, ఆయన వర్గీయులు అసహనానికి గురయ్యారు. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ఎస్సీ రిజర్వ్‌డ్‌గా ఉన్న నియోజకవర్గంలో నిర్వహిస్తూ ఆ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేని, దళిత నేతలను అవమానించేలా వారి పేర్లు లేకుండా కరపత్రాల ముద్రణ కాస్త వివాదాస్పదమైంది. దీంతో టీడీపీకి దళితుల అవసరం తీరిపోయిందని, గుండుమల గుత్తాధిపత్యం కింద తాము ఆత్మాభిమానాన్ని చంపుకుని పనిచేయలేమంటూ శతజయంతి వేడుకలకు దళిత నాయకులు మూకుమ్మడిగా దూరమైనట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే ఈరన్న లేని లోటు ఈ ఉత్సవాల్లో స్పష్టంగా కనబడింది.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

హిందూపురం: మండలంలోని నందమూరినగర్ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. తూమకుంట నుంచి హిందూపురం వైపు వెళుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ఆటోలో ప్రయాణం చేస్తున్న షర్పు(35) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటనపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువతి ఆత్మహత్య

గుంతకల్లు రూరల్: జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన అంజనేయులు కుమార్తె కావేరి (21)కి కొంత కాలం క్రితం గుండె సంబంధిత శస్త్రచికిత్స జరిగింది. అప్పటి నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో కొంత కాలం క్రితం గుంతకల్లులోని మిల్లు కాలనీలో ఉంటున్న తన చిన్నాన్న బసప్ప ఇంటికి వచ్చిన ఆమె... బుధవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను కాపాడి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ఆవును చంపిన చిరుత

బ్రహ్మసముద్రం: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఆవును ఓ చిరుత చంపి, సగానికి పైగా తినేసింది. గ్రామానికి చెందిన రైతు కాపు బసిరెడ్డి మంగళవారం రాత్రి తన తోటలో పశువుల మందను వదిలి ఇంటికెళ్లి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత మందలోకి చొరబడిన చిరుత.. ఓ ఆవును చంపి తినేసింది. బుధవారం ఉదయం తోటకెళ్లిన రైతు ఈ విషయాన్ని గుర్తించి, సమాచారం అందించడంతో అటవీశాఖ అధికారులు పరిశీలించారు.

జూడో క్రీడాకారుల ఎంపిక నేడు

కళ్యాణదుర్గం: జాతీయ స్థాయి అండర్ –19 జూడో చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఈ నెల 18, 19 తేదీల్లో స్థానిక జ్ఞానభారతి ప్రైవేట్ విద్యాసంస్థల క్రీడా మైదానంలో చేపట్టనున్నారు. ఈ మేరకు జూడో అసోసియేషన్ కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ, సీఈఓ బాబు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ 6 నుంచి 12వ తేదీ వరకూ భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిథ్యం వహించాల్సి ఉంటుంది.

ఆ రెండు ఆస్పత్రులు సీజ్

- అనుమతుల్లేకుండా రూత్ ఆస్పత్రి నిర్వహణ
- గర్భిణి మృతితో అజ్ఞాతంలోకి డాక్టర్ లక్ష్మీకాంతమ్మ
- అనుమతుల్లేకున్నా.. ఆస్పత్రి నిర్వహణ
- రెన్యూవల్ చేయించుకోని బాలాజీ నర్సింగ్ హోం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం క్రైం: గర్భిణుల మృతికి కారణమైన అనంతపురంలోని రూత్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, శ్రీబాలాజీ నర్సింగ్ హోంలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర్ బుధవారం సీజ్ చేశారు. ఈ నెల 15న ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన కవిత(25), నగరంలోని ఆర్వేటి నగర్‌కు చెందిన సనం సుల్తానా(28)తో పాటు గర్భస్థ శిశువూ మృతి చెందిన విషయం విదితమే. దీనిపై ఈ నెల 16న 'అనంతలో దారుణం', ఈ నెల 17న 'చిదిమేస్తున్నారు' శీర్షికలతో 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. వీటిపై స్పందించిన కలెక్టర్ గౌతమి తక్షణమే విచారణకు ఆదేశించారు. దీంతో రంగంలో దిగిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర్, డెమో బృందం ఆయా ఆస్పత్రులను సీజ్ చేశారు. డెమో భారతి, ఆరోగ్యశాఖ సిబ్బంది త్యాగరాజు, వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, లీగల్ కన్సల్టెంట్ ఆశారాణి, తదితరులు పాల్గొన్నారు.

పత్తాలేని డాక్టర్ లక్ష్మీకాంతమ్మ

బుధవారం సాయంత్రం తొలుత శ్రీనివాస్‌నగర్‌లోని రూత్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వైద్యాధికారులు వెళ్లారు. ఆస్పత్రికి తాళం వేసి ఉండడంతో ఆస్పత్రి వైద్యురాలు, వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మకు డీఎంహెచ్‌ఓ ఫోన్ చేశారు. తాను ఊళ్లో లేనని ఆమె సమాధానమివ్వడంతో చుట్టుపక్కల వారితో ఆరా తీశారు. రోజూ కర్ణాటక, జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో గర్భిణులు వస్తుంటారని, ఈ పరిస్థితి జాతరను తలపిస్తూ ఉంటుందని వివరించారు. 20 పడకలతో ఆస్పత్రి నిర్వహణకు అనుమతులు కోరుతూ ఈ ఏడాది ఏప్రిల్ 11న నిర్వాహకురాలు ఆరోగ్యశాఖకు దరఖాస్తు చేసుకోగా, క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు లోపాలను గుర్తించి ఆ దరఖాస్తును తిరస్కరించారు. అయినా రూత్ ఆస్పత్రిని రెండో రోడ్డు ఎక్స్‌టెన్షన్, తపోవనం వద్ద నిర్వహిస్తున్నట్లు దరఖాస్తులో చూపి శ్రీనివాసనగర్‌లో కొనసాగిస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో ఆస్పత్రిలోని మూడు గదులకు నోటీసులు అతికించి సీజ్ చేశారు. కాగా, ఇప్పటికే డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై కుప్పలుతిప్పలుగా ఫిర్యాదులున్నాయని, ఈ నేపథ్యంలో ఆమె డిగ్రీని రద్దు చేసేందుకు అధికారికారులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. అనంతరం బాలాజీ నర్సింగ్ హోంకు వెళ్లిన వైద్యాధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. 50 పడకల నిర్వహణకు ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీతో అనుమతులు పూర్తికాగా, అప్పటి నుంచి రెన్యూవల్ చేసుకోలేదని గుర్తించారు. అంతేకాక ఫైర్ ఎన్‌ఓసీ లేకపోవడం, పీజీ వైద్యురాలి డిగ్రీ రెన్యూవల్ కాకపోవడం, ఆస్పత్రిలో ముగ్గురు వైద్యులు మాత్రమే విధులు నిర్వర్తిస్తుండగా ఆరుగురి ప్లేను డిస్‌ప్లేలో ఉంచడం తదితర అంశాలను గుర్తించి, ఆస్పత్రిని సీజ్ చేశారు.



రూత్ ఆస్పత్రి వద్ద డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర్ తదితరులు



బాలాజీ నర్సింగ్ హోంను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

ఉత్కంఠగా చెస్ చాంపియన్‌షిప్ పోటీలు

హిందూపురం: స్థానిక మేళాపురంలోని స్పార్టన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్ ఓపెన్, మహిళా చెస్ చాంపియన్ షిప్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఐదు రౌండ్లలో నిర్వహించిన ఈ పోటీలు ఎంతో ఉత్కంఠగా సాగాయి. జిల్లా స్పార్టన్ చెస్ ఆకాడమీ జిల్లా కార్యదర్శి నాగార్జున కర్ణాటకమ్, టోర్నీ డైరెక్టర్ అరిఫుల్లాఖాన్ పర్యవేక్షించారు. సీనియర్ ఓపెన్ విభాగంలో అఫ్రిద్‌ఖాన్ మొదటి స్థానాన్ని, జ్ఞాపికారెడ్డి రెండో స్థానాన్ని, కార్తీకేయ మూడో స్థానాన్ని, జయకృష్ణ నాల్గో స్థానాన్ని దక్కించుకున్నారు. మహిళా విభాగంలో జ్ఞాపికారెడ్డి మొదటి స్థానాన్ని దక్కించుకోగా.. తర్వాత వరుసగా నాలుగు స్థానాల్లో పూర్ణిమ, మధుశ్రీ, వెంకటసాయి సహస్ర నిలిచారు. మహిళా విభాగంలో ప్రతిభ చాటిన నలుగురూ ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకూ తిరుపతి వేదికగా సాగే రాష్ట్ర స్థాయి సీనియర్ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా కార్యదర్శి, చీఫ్ ఆర్బిటర్ మల్లికార్జున, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు.



చెస్ పోటీల్లో విజేతలైన వారితో నిర్వాహకులు

విజ్ఞాన శిబిరాలతో మేథో వికాసం

అనంతపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో మేథో వికాసం పెంపొందుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. అనంతపురంలోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అంతకు ముందు అక్కడే ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమామోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, డాక్టర్ మార్కురెడ్డి, నాగార్జునరెడ్డి మాతృమూర్తి కృష్ణమ్మ, సంస్థ కార్యదర్శి పి.రమ తదితరులు పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

జీవాలకు టీకాలు వేయించండి

తాడిమర్రి: జీవాలన్నింటికి (గొర్రెలు, మేకలు) చిటిక వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కాపరులకు పశువర్థక శాఖ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని చిల్లవారిపల్లిలో కేతిరెడ్డి ఓంశేఖర్‌రెడ్డికి చెందిన గొర్రెల మందలో ఆరు రోజుల్లోపు 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న ఆయన బుధవారం గ్రామానికి చేరుకుని గొర్రెల మందను పరిశీలించారు. బుధవారం మృతి చెందిన గొర్రెకు జిల్లా రోగ నిర్ధారణ అసిస్టెంట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డితో పోస్టుమార్టం చేయించారు. తీవ్రమైన ఎండల కారణంగా గొర్రెలకు చిటిక వ్యాధి సోకినట్లు గుర్తించి, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాపరులను చైతన్య పరిచారు. ముందుస్తుగా చిటిక వ్యాధి టీకాలు వేయించడంతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే గొర్రెలు మృత్యువాత పడకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి స్వర్ణలత, గోపాలమిత్రలు రామాంజినేయులు, వలి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పరమేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి సేవలో చిత్తూరు అడిషనల్ ఎస్పీ

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామిని చిత్తూరు ఏసీబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అర్చకులు ప్రసాదం అందజేశారు. శ్రీవారి చిత్రపటాన్ని ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో కదిరి డీఎస్పీ శ్రీలత పాల్గొన్నారు.



శ్రీవారి చిత్రపటాన్ని ఏఎస్పీ శ్రీలక్ష్మికి అందజేస్తున్న చైర్మన్ గోపాలకృష్ణ

కొలువుకు ఇం'టర్న్' షిప్

- డిగ్రీ మూడో సంవత్సరం 5, 6 సెమిస్టర్లలో తప్పనిసరిగా అప్రెంటిషిప్, ఇంటర్న్‌షిప్
- ఆరు నెలల కాల వ్యవధితో కూడిన ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ శిక్షణ అనివార్యం
- ప్రారంభమైన ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ నివేదికల మూల్యాంకనం
- ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్‌కు 200 మార్కుల కేటాయింపు

అనంతపురం: ఇంటర్మీడియట్ తర్వాత డిగ్రీ చదవడం సాధారణం. అయితే, డిగ్రీ సర్టిఫికెట్‌తో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కడం లేదు. ఏ కంపెనీ ఇంటర్వ్యూకు వెళ్లినా నైపుణ్యతపై ఆరా తీస్తుండడంతో ఆ దిశగా నైపుణ్యాల మెరుగుకు డిగ్రీ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్‌నకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా 2020–21 విద్యా సంవత్సరం నుంచే పూర్తిస్థాయిలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని అమలు చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఇప్పటికే బీఏ, బీకాం, బీబీఎం కోర్సులు చదివే విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పూర్తయింది. వీరికి ఈ నెల 17వ తేదీ నుంచి ఇంటర్న్‌షిప్ ఎవాల్యుయేషన్‌కు సంబంధించిన వైవాలు ప్రారంభమయ్యాయి. మొత్తం 200 మార్కులకు వైవా ఉంటుంది. ఇందులో ప్రాజెక్ట్ రిపోర్టు సమర్పణకు 50, ఎక్స్‌టర్నల్స్‌కు 150 మార్కులు కేటాయించారు. వైవాను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలనే ఎంపిక చేశారు. బీఏ, బీకాం, బీబీఎం, బీబీఏ కోర్సుకు చెందిన 7,447 మంది విద్యార్థులు వైవాకు హాజరుకానున్నారు. 2020–21 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి బ్యాచ్ విద్యార్థులు కావడంతో వైవా అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, టీచర్ గైడ్(మెంటార్), ఇంటర్నల్ ఎగ్జామినర్, ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్(వర్సిటీ చేత నామినేట్ చేయబడిన వ్యక్తి)ల పర్యవేక్షణలో వైవా కమిటీని నియమించారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే సంబంధిత కమిటీల పరిశీలన అనంతరం జ్ఞానభూమి పోర్టల్‌లో వివరాలు నమోదు చేయనున్నారు.



తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న వైవా ప్రక్రియ

కట్టుదిట్టంగా నిర్వహిస్తాం

ఈ నెల 17 నుంచి బీఏ, బీకాం, బీబీఎం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ ఎవాల్యుయేషన్ నిర్వహిస్తున్నాం. కేవలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే ఎవాల్యుయేషన్ ప్రక్రియ నిర్వహించాలని నిర్దేశించాం. మార్కులు కేటాయింపు పరిశీలనకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేశాం.
–ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ